# మైనారిటీ డిక్లరేషన్ పేరిట ముస్లింలను వంచించిన కాంగ్రెస్

## ఓటు బ్యాంకుగా వాడుకొని హామీలను ఉల్లంఘిస్తున్న ప్రజా ప్రభుత్వం

## నమ్మక ద్రోహం చేస్తున్న కాంగ్రెస్‌కు భవిష్యత్ లో సరియైన గుణపాఠం

### బాల్కొండ కానిస్టెన్సీ బీయర్ఎస్ నాయకులు ఆక్షేపన



వేల్పూర్, బతుకమ్మ :అధికార దాహంతో అందాళం ఎక్కడానికి గాను మైనార్టీ డిక్లరేషన్ పేరిట ముస్లీం లకు అమలకు సాధ్యం కానీ హామీలను ఇచ్చిన కాంగ్రెస్ మైనార్టీ ముస్లీం లను వంచించింది అని బాల్కొండ కానిస్టెన్సీ మైనార్టీ నాయకులు ఎం. ఏ మోహిజ్, సర్వర్ హుస్సేన్, ఎం. డి అక్రం లు ఆరోపించారు. మండల కేంద్రంలో గురువారం బీయర్ఎస్ కానిస్టెన్సీ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీలపై అనుసరిస్తున్న విధానాలపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ చరిత్రాత్మకంగా మైనారిటీలను కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటూ ఇచ్చిన హామీలను ఉల్లంఘిస్తూ వస్తోందని విమర్శించారు. అధికారంలోకి రాకముందు ఎన్నో హామీలు ఇస్తూ, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందన్నారు. తెలంగాణలో కూడా అదే పరిస్థితి కనిపిస్తోందని, మైనారిటీల సంక్షేమానికి ప్రతి సంవత్సరం రూ.4,000 కోట్లు కేటాయిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, మూడు బడ్జెట్లలో కలిపి సుమారు రూ.10,400 కోట్లు కేటాయిం చామని చెప్పుకుంటున్న ప్పటికీ, వాస్తవంగా వాటిలో కనీసం రూ.2,000 కోట్లు కూడా ఖర్చు చేయలేకపోయిందని ఏద్దేవా చేశారు . 2024-25 సంవత్సరంలో రూ.2,150.78 కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా, కేవలం ?793.79 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం, కేవలం 37 శాతమే ఖర్చు చేయడం మైనారిటీలపై నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. మైనారిటీ కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న షాదీ ముబారక్ పథకం పూర్తిగా నిర్లక్ష్యం చేయబడిందని తెలిపారు. బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి మైనారిటీ ఆడబిడ్డకు రూ.1,60,000 ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పిన హామీ అమలు కాలేదని అన్నారు. మైనారిటీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్, ప్రీ-మెట్రిక్, పోస్ట్-మెట్రిక్, విదేశీ విద్యా స్కాలర్షిప్లు సకాలంలో అందకపోవడంతో అనేక మంది విద్యార్థులు చదువును మధ్యలోనే నిలిపివేస్తున్నారని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్మెం ట్‌ను రూ.300 కోట్ల నుంచి రూ.100 కోట్లకు తగ్గించడం విద్యార్థుల భవిష్యత్తుపై పెద్ద దెబ్బగా అభివర్ణించారు. అబ్దుల్ కలాం తౌఫా-యే-తాలీమ్' పథకం కింద ఇచ్చిన హామీలు కూడా అమలు కాలేదని, పీహెచ్డీ, ఎంఫిల్, పీజీ, ఇంటర్, 10వ తరగతి విద్యార్థులకు ప్రకటించిన ఆర్థిక సహాయం అందలేదని తెలిపారు. మైనారిటీలకు ముఖ్యమైన రంజాన్ తోఫా పథకాన్ని పూర్తిగా రద్దు చేయడం దురదృష్టకరమని అన్నారు. నిరుద్యోగ మైనారిటీ యువత,మహిళలకు ప్రతి సంవత్సరం రూ.1,000 కోట్ల సబ్సిడీ రుణాలు ఇస్తామని చెప్పి అమలు చేయకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. గత ప్రభుత్వ కాలంలో అమలు చేసిన 80% సబ్సిడీ రుణాలను కూడా దాదాపుగా నిలిపివేశారని ఆరోపించారు. సుమారు ఒకటిన్నర సంవత్సరాల పాటు రాష్ట్ర మంత్రివర్గంలో మైనారిటీలకు ప్రాతినిధ్యం లేకుండా ఉంచడం తీవ్రమైన అన్యాయమని పేర్కొన్నారు. సిక్కులు, క్రిస్టియన్లకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని చెప్పినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇమామ్లు, మౌజంల వేతనాల పెంపు హామీ అమలు కాలేదని, వక్ఫ్ బోర్డు ఆస్తుల రక్షణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. వక్ఫ్ ఆస్తుల డిజిటలైజేషన్ పేరుతో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని, ఆక్రమణలు కొనసాగుతున్నాయని అన్నారు. ఇల్లు లేని మైనారిటీ కుటుంబాలకు స్థలం తో పాటు రూ.5 లక్షలు ఇస్తామని ప్రకటించినా అమలు స్థాయిలో ఎలాంటి పురోగతి లేదన్నారు. సచార్ కమిటీ, సుధీర్ కమిషన్ సిఫార్సులను పూర్తిగా పక్కన పెట్టారని తెలిపారు. ఇది మైనారిటీల నమ్మకానికి చేసిన పెద్ద ద్రోహమని పేర్కొన్నారు. చివరిగా, మైనారిటీలకు కేటాయించిన నిధులను పూర్తిగా వినియోగించడంతో పాటు, ఇచ్చిన హామీలన్నింటినీ తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈ ప్రెస్ మీట్ లో కానిస్టెన్సీ మైనార్టీ నాయకులు అబ్దుల్ రజాక్,ఎం. డి తాహేర్,ఎం.డి అజీజ్ (అతీక్) ఎం. డి సూర్జీల్,ఎం. డి ఇక్రమ్,ఎం.డి అహ్మద్ కమ్మర్పల్లి మహబూబ్,షాహీద్, ఫయాజ్, ఇఫ్తికార్,సల్లవుద్దీన్,మిస్బా హరున్ బాబా,యూసుఫ్ అజీజ్,యాసిన్,అక్తర్,జైనోద్దీన్, మునీర్, రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు

## రోడ్డు భద్రత చర్యలు

### ఎస్సై అనిల్ రెడ్డి



కమ్మర్ పల్లి, బతుకమ్మ :రోడ్డు ప్రమాదాల నివారణకు గాను రోడ్డు భద్రత చర్యల్లో భాగంగా ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో రోడ్డు భద్రత చర్యలు చేపట్టినట్లు ఎస్సై అనిల్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల ప్రధాన దారుల్లో మూల మలుపుల వద్ద పెరిగిన పొదలను తొలగించినట్లు తెలిపారు. మూలల వద్ద పొదలు ఉండడం కారణంగా ముందు నుండి వచ్చిపోయే వాహనాలు కనిపించక యాక్సిడెంట్లు జరుగుతున్నాయని అన్నారు. ఈ చర్యల వల్ల వాహనాధారులకు ముందున్న మార్గం స్పష్టంగా కనిపించి ప్రమాధాలు తగ్గే అవకాశం ఉంటుందని ఎస్సై ఆశాభావం వ్యక్తం చేశారు. వాహనదారులు నిబంధనలకు లోబడి వాహనాలను నడపాలని, అన్ని జాగ్రత్తలు పాటించాలని ఎస్సై సూచించారు. ఈ భద్రత చర్యల్లో పోలీస్ సిబ్బంది, ఆయా గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని రోడ్డు పనులను పూర్తి చేశారు.



## విజయవంతంగా ముగిసిన ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర మహాసభలు

### ఏఐకెపీ ఎం ఎస్ రాష్ట్ర కార్యదర్శి పి. రామకృష్ణ



సిరికొండ, బతుకమ్మ : కామారెడ్డి కేంద్రం లో 24,25 తేదీల్లో రెండు రోజులు నిర్వహించిన ఏఐకెఎంఎస్ మహాసభలు ఉత్సాహంగా, విజయవంతగా ముగిసాయని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) రాష్ట్ర కార్యదర్శి పి. రామకృష్ణ అన్నారు. గురువారం ఆయన బతుకమ్మ ప్రతినిధితో మాట్లాడుతూ ఈ ప్రథమ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర నూతన కార్యవర్గ ఎన్నిక జరిగిందని, ఈ కార్యవర్గంలో మండలానికి చెందిన ముగ్గురికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ముగ్గురికి చోటు లభించిందన్నారు. ఇందులో భాగంగా సిరికొండ మండలం లో తనతో పాటు మరో ఇద్దరు రావుట్ల గ్రామానికి చెందిన ఈ. రమేష్ కు రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా, గడ్కోల్ గ్రామానికి చెందిన బి కిషోర్ కార్యవర్గ సభ్యుడిగా, స్థానం లభించిందన్నారు . వ్యవసాయ కార్మిక సంఘం ఏర్పడ్డప్పటినుంచి రాష్ట్రంలో జిల్లాలో మండలంలో సంఘం అభివృద్ధికి, వ్యవసాయ కూలీల కోసం బలమైన పోరాటాలు ఉద్యమాలు చేయడం వల్ల, క్రియాశీలకంగా వ్యవహరించడం వల్ల వీరికి రాష్ట్ర కమిటీ గుర్తించి ప్రధానమైన బాధ్యతలు అందించిందని ఆయన అన్నారు. తాను 30 ఏళ్లుగా క్రియాశీలకంగా పని చేశానని తన సేవను గుర్తించి తనకు అవకాశం ఇచ్చారన్నారు.. రాష్ట్రవ్యాప్తంగా జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు నిర్మిస్తూ తనదైనా శైలిలో పనిచేయడం జరిగిందన్నారు. నాతో పాటుగా వీరిద్దరూ అనేక భూపోరాటాలు, ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్మించారని, వీరు అంకితభావం తో సంఘం అభివృద్ధి కోసం పని చేశారని , దాని వల్ల వీరు రాష్ట్ర నాయకత్వ స్థాయి లోకి ఎన్నుకోవడం జరిగిందన్నారు.

## వేతనాల కోసం భగీరథ ఆపరేటర్ల ధర్నా



జక్రాన్ పల్లి, బతుకమ్మ :బాల్కొండ కానిస్టెన్సీ పరిధిలోని మండలాలకు చెందిన భగీరథ ఆపరేటర్లు, లైన్ మెన్లు, సూపరవైజర్లు, లేబర్లు తమకు రావలసిన వేతనాలను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ధర్నాకు దిగారు. ఇందులో భాగంగా గురువారం మండలంలోని ఆర్గుల్ లోని భగీరథ ఈ. ఈ ఆఫీస్ ఎదుట 200 మంది సిబ్బంది బైటయించారు. తమకు గత 8 నెలలుగా రావాల్సిన వేతనాలు రావడంలేదుని, ఈ వేతనాల కోసం ఇప్పటి వరకు డీ. ఈ స్థాయిలో కూడా రెండు మార్లు ధర్నా నిర్వహించి, వినతి పత్రం అందించినీ ఎలాంటి ఫలితం లేదన్నారు. 8 నెలలుగా వేతనాలు లేకుండా కుటుంబాల పోషణ ఎలా సాధ్యమని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ధర్నా నిర్వహించిన ఈ. ఈ రాకపోవడంతో ఆర్గుల్ ఈ ఈ ఆఫీస్ వద్ద రన్ అవుతున్న మోటార్లను బంద్ చేయడానికి భాధీతులు సన్నద్ధం కాగా ఈ ఈ అమీర్ ఖాన్ వచ్చి వచ్చే నెల 1 వరకు సమయం ఇవ్వాలని తాను పై అధికారులతో మాట్లాడి వేతనాలు వచ్చేలా చేస్తానని హామీ ఇవ్వడంతో భగీరథ సిబ్బంది ధర్నా విరమించారు. అనంతరం ఈ ఈ కిభాధితులు వినతి అందజేశారు. ఈ సందర్బంగా ఈ ఈ మాట్లాడుతూ ఇప్పటి వరకు తన దృష్టికి తీసుకురాలేదని, ఇప్పుడు మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో సిబ్బంది మోటార్లను ఆన్ చేసి వారి వారి స్థానాల్లో పనుల్లో చేరారు.

## జాన్కం పేట్ కె జి బి వి ని సందర్శించిన సబ్ కలెక్టర్

### రికార్డులు పరిశీలించి, సౌకర్యాల పై ఆరా



వేల్పూర్, బతుకమ్మ :మండలంలోని జాన్కం పేట్ కె జి బీ వి స్కూల్ ను ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా ఆకస్మికంగా సందర్శించారు. ఇందులోభాగంగా గురువారం కేజీవిభీ స్కూల్ సౌకర్యలను గురించి విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. హాస్టల్ మెనూ రికార్డ్ లను, సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించారు. విద్యార్థుల మెనూ, సెలబస్ వివరాలను స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. అనంతరం క్లాస్ రూమ్ లో జరుగుతున్న పాఠ్యంశ బోధన తీరును పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ అనిరోధ్, డూప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్. ఐ గోపాల్, వేణు సిబ్బంది ఉన్నారు.

